
సాక్షి
గుంటూరు
గురువారం । 7 । నవంబర్ । 2024




స్కానర్ల పనితీరు పరిశీలన

మంగళగిరి: చెత్త సేకరణ తీరును పరిశీలించేందుకు ఇంటింటికి ఏర్పాటుచేసిన ఆర్‌టీఎంఎస్(రియల్ టైమ్ మానిరింగ్ సిస్టమ్)లను కమిషనర్ అలీంబాషా బుధవారం పరిశీలించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 7,226 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 3240 క్యూసెక్కులు వదిలారు.



సూరేపల్లిలో పడి పూజ

భట్టిప్రోలు: సూరేపల్లిలో కొలువైన శ్రీ కేదారేశ్వర వాయులింగ దేవస్థానంలో బుధవారం పడి పూజ నిర్వహించారు. స్వాములు వాయు లింగానికి సాష్టాంగ నమస్కారాలు చేశారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



తాడికొండ: తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరిలతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.

శిశు విక్రయ కేసులో ముగ్గురి అరెస్ట్

నరసరావుపేటటౌన్: శిశు విక్రయ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు నరసరావుపేట టూటౌన్ సీఐ హైమారావు బుధవారం తెలిపారు. పట్టణంలో అక్రమంగా శిశు విక్రయాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దాసరి శౌరిరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిమ్మతోటకు చెందిన పోకులూరి అనిల్ తన శిశువును విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన పాటి శ్రీనివాసరావుకు విక్రయించినట్లు తెలుసుకున్నారు. వారిద్దరితోపాటు మధ్యవర్తిగా వ్యవహరించిన మహిళను అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరిస్తాం




నగరంపాలెం: ప్రజా సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి న్యాయం చేస్తామని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో బుధవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారాల వ్యవస్థను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల్లో నిర్వర్తించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పోలీస్ అధికారులు విధిగా హాజరుకావాలని అన్నారు. ప్రజా సమస్యలను అలకించి, చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కరించేందుకు నిరంతరం పోలీసులు అందుబాటులో ఉంటారని అన్నారు.

సబ్ జైలులో 'మీకు తెలుసా'

గురజాల: స్థానిక సబ్ జైల్‌నందు రీడ్స్ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమంపై బుధవారం అవగాహన నిర్వహించారు. పీసీ కె రవికుమార్ మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుంది..ఎటువంటి జాగ్రత్తలు చేపట్టాలి అనే విషయాల గురించి ఖైదీలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్/హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులను చిన్నచూపు చూడరాదని కలిసి జీవించాలన్నారు. క్షయ వ్యాధి, సుఖ వ్యాధుల గురించి తెలియచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకయ్య, ఎల్‌టీ కృష్ణ, రీడ్స్ ఏఎస్ఎం యలమందమ్మ, పీఈలు, జైలర్ సీహెచ్ వీఎస్ సుబ్బారెడ్డి తదితరులున్నారు.

నాగార్జున కొండను సందర్శించిన శ్రీలంక దేశీయులు



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను బుధవారం శ్రీలంక దేశానికి చెందిన 50 మంది బృందం సందర్శించింది. వీరు స్థానిక లాంచీస్టేషన్ నుంచి శాంతిసిరి లాంచీలో నాగార్జునకొండకు చేరుకున్నారు. కొండలోని మ్యూజియంలో ఉన్న తొమ్మిది అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, బుద్ధుని పుట్టుకకు సంబంధించిన శిలా ఫలకాలు, రాతి పనిముట్లు, సింహాళ విహార్‌లోని మహాస్థూపం, అశ్వమేధ యాగ శాల, స్నానఘట్టం తిలకించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రాముఖ్యత గురించి పర్యాటకశాఖ ఉద్యోగులు వారికి వివరించారు. అనంతరం అనుపు, యాంపీ స్టేడియం, ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు.

షార్ట్ ఫాల్.. కాసుకో!



నగరంలో షార్ట్‌ఫాల్‌లో ఉన్న భవనాలు 1,187

- లంచాలు తీసుకుని మౌనంగా ఉన్న సిబ్బంది
- ఆదాయానికి భారీగా గండి
- రూ.60 కోట్ల వసూళ్లపై మీనమేషాలు
- అధికార పార్టీ నేతలకు దాసోహం
- ఇతర పక్షాలైతేనే వేధింపులే!
- ఇది గుంటూరు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ కహానీ

పక్కా 'ప్లానింగ్'తో 'షార్ట్'కట్ సంపాదన

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు కార్పొరేషన్‌లో సిబ్బంది రా'కాసులు'గా మారారు. 'పైసా'చిక ఆనందం కోసం కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. విధులను పక్కన బెట్టేసి ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలోని ఏ కార్పొరేషన్‌లోనూ ఇంతటి అవినీతి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రూ.కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మరీ సిబ్బంది ఇక్కడ పోస్టింగ్ వేయించుకుని వస్తున్నారంటే గుంటూరు ఏ స్థాయి ఆదాయ వనరుగా మారిందో అర్థమవుతోంది. ప్లాన్‌ను అతిక్రమించి కడుతున్న అక్రమ కట్టడాలు, భవనాల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. స్థానిక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌ను మేనేజ్ చేస్తే ఎటువంటి భవనమైనా అనుమతులు లేకుండా కట్టేసుకోవచ్చు. అడిగేవారు ఉండరు. అనుమ తుల్లేని భవనాలను షార్ట్‌ఫాల్‌గా చూపి నిబంధనల మేరకు నోటీసులు ఇవ్వాల్సిన సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి భారీగా దండుకుంటున్నారు.

మనోళ్లు కాకపోతేనే సమస్య

భవన నిర్మాణదారులు డబ్బులు ఇవ్వకపోయినా, అధికార పార్టీకి వ్యతిరేకం అయినా ఆఘమేఘాలపై వాలిపోతున్నారు. వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు వారిని ఏ విధంగా ఇబ్బంది పెట్టాలనే అంశంపై దృష్టి పెడుతున్నారు. నగరంలో అందరికీ ఒకే న్యాయం ఉండాల్సింది పోయి అధికారపార్టీకి దాసోహం అంటున్నారు. ఇతరులకు అన్యాయం చేస్తున్నారు. సుప్రీం కోర్టు నిబంధనలు కూడా గాలికి వదిలేసి ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం అనే విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

షార్ట్‌ఫాల్ చూపించినా.. యథేచ్ఛగా నిర్మాణం

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తీసుకున్న ప్లాన్‌కు భిన్నంగా సెట్‌బ్యాక్‌లు వదలకపోయినా, అదనంగా గదుల నిర్మాణం జరిగినా.. అదనపు అంతస్తులు నిర్మించినా.. నిబంధనలు ఏమాత్రం మీరినా టౌన్ ప్లానింగ్ విభాగ సిబ్బంది కంప్యూటర్‌లో షార్ట్‌ఫాల్ కింద చూపిస్తారు. ఆ తర్వాత విచారణ చేపట్టి స్టాప్ వర్క్ ఆర్డర్ కాపీ జారీ చేస్తారు. ఇది జారీ చేసిన 15 రోజుల్లో భవన నిర్మాణదారులకు నోటీసు జారీ చేస్తారు. ఆ తర్వాత 15 రోజుల్లోపు భవన నిర్మాణదారు నుంచి సరైన ఆధారాలతో సమాధానం రాకపోతే ప్లాన్ పూర్తిగా రద్దుచేస్తారు. అయితే షార్ట్‌ఫాల్ చూపించిన తర్వాతే అధికారుల తిరకాసుల పర్వం మొదలవుతోంది. సిబ్బంది చేయి తడిపితే నిబంధనలు ఏమీ అడ్డంకి కావు. యథేచ్ఛగా నిర్మాణాలు సాగించుకోవచ్చు. నిర్మాణాలు జరిగి ఏళ్లు గడిచినా కార్పొరేషన్ నుంచి ఇబ్బంది రాదు. నగరంలో ఇలా షార్ట్‌ఫాల్ కింద చూపిస్తున్న భవనాల సంఖ్య ప్రస్తుతం 1,187 వరకు ఉంది. వీరిలో ఎవరికీ ఇప్పటివరకు నోటీసులు ఇవ్వలేదు. నిర్మాణాలు ఆపలేదు.

250కిపైగా టీడీపీ ప్రముఖులవే

షార్ట్‌ఫాల్ చూపిన భవనాల్లో సుమారు 250కిపైగా తెలుగుదేశం పార్టీ ప్రముఖులకు చెందినవే ఉన్నట్లు ఒక అంచనా. అసలు వీరి వైపు కార్పొరేషన్ అధికారులు తొంగి కూడా చూడటం లేదు. మరోవైపు కాసులు సమర్పించుకున్న వారివైపు కూడా చూడటం లేదు.



'పులి'లా గాండ్రించేనా!

షార్ట్‌ఫాల్ చూపిన 1,187 భవనాల్లో సుమారు 635 భవనాలకు రూ.60 కోట్ల వరకూ కార్పొరేషన్‌కు ఆదాయం రావాల్సి ఉంది. ముడుపులు మెక్కేసిన అధికారులు దీని గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఈ వ్యవహారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు దృష్టికి వచ్చింది. ఆయన టౌన్‌ప్లానింగ్ ప్రక్షాళనపై చర్యలు తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాల్సిందే. ఈ అవినీతిపైనా, సుప్రీంకోర్టు నిబంధనలకు అనుకూలంగా సమన్యాయం జరగడం లేదనే భావనతో హైకోర్టు/సుప్రీంకోర్టు తలుపు తట్టేందుకు కొందరు కార్పొరేటర్లు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

అపరాల సాగు రైతులకు అవగాహన



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం గొడవర్రులో అపరాలు సాగు చేస్తున్న రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నీతి ఆయోగ్ సీనియర్ రీసెర్చ్ అధికారి ఎం.అనూరాధ, జిల్లా వ్యవసాయ కార్యాలయ అధికారి ఎన్.శ్రీవాణి విచ్చేసి అపరాలు సాగుచేయడంలో సమస్యలను వివరించారు. అపరాలు విస్తీర్ణం పెంచడంపై రైతులకు అవగాహన కల్పించారు. అపరాలు సాగుచేయడం వలన భూసారం పెరుగుతుందని, రైతులు అవసరం మేరకే పురుగు మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి పి.శిరీష, ఏఈవో రమేష్, వీఏఎ పవన్, రైతులు, ఎంపీటీసీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధిపై ముగిసిన తొలి విడత శిక్షణ


గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై జిల్లా, మండలస్థాయి అధికారులకు జెడ్పీ సమావేశ మందిరంలో రెండు రోజులపాటు నిర్వహించిన మొదటి విడత శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈసందర్భంగా పల్నాడు జిల్లా పరిధిలోని 28 మండలాలకు చెందిన అధికారులకు, గ్రామ పంచాయతీల కార్యదర్శులకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు తొమ్మిది సూత్రాల ఆధారిత అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఏపీ పంచాయతీ రాజ్–గ్రామీణాభివృద్ధి సంస్థ జేడీ ఆర్.కేశవరెడ్డి, పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కరరెడ్డి సమన్వయంతో జరిగిన శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ కె.మోహనరావు, ఏపీఎం జవన్, డీపీఎం డి.రవీంద్రబాబు, బి.దయాసాగర్, డీపీఆర్సీ జిల్లా సమన్వయకర్త ఎస్. పద్మరాణి, కె. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు, రేపు గుంటూరు, బాపట్ల జిల్లాలకు..

గురు, శుక్రవారాల్లో గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులకు ఈ శిక్షణా కార్యక్రమాలు జరగనున్నాయి.

మళ్లీ సీఆర్‌డీఏలోకి వేమూరు

- 5 మండలాలు, వాటి పరిధిలోని 89 గ్రామాల విలీనానికి ఆమోదం
- వైఎస్సార్ సీపీ సర్కారు హయాంలో 'బుడా'లో నియోజకవర్గం
- అంతకుముందూ సీఆర్‌డీఏలోనే ఉన్నా ప్రగతి శూన్యం
- చంద్రబాబు గ్రాఫిక్స్‌తో ప్రజలకు తప్పని అవస్థలు



వేమూరు మ్యాప్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వేమూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని సీఆర్‌డీఏ కలిపే ప్రతిపాదనకు బుధవారం ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నియోజకవర్గంలోని వేమూరు, చుండూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమృతలూరు మండలాల పరిధిలో ఉన్న 89 గ్రామాలను సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకోనున్నారు. తాజా ప్రతిపాదనతో 562 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం తాజాగా సీఆర్‌డీఏలో చేరనుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి వేమూరు నియోజకవర్గాన్ని అందులో కలిపారు. అయిదేళ్లుగా వేమూరు బుడాలో ఉంది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి సీఆర్డీఏను పునరుద్ధరించి ఈ నియోజకవర్గాన్ని అందులో కలపాలన్న ప్రతిపాదన తీసుకొచ్చారు. ఎట్టకేలకు ఏపీ క్యాబినెట్ దీనికి ఆమోదం తెలిపింది.

లేనిది ఉన్నట్టుగా కనికట్టు

2014లో చంద్రబాబు ప్రభుత్వం సీఆర్‌డీఏను ఏర్పాటు చేసి అమరావతిని అద్భుతమైన రాజధానిగా మారుస్తున్నట్లు గొప్పలు చెప్పింది. ఆచరణలో అది ఎక్కడా కనిపించలేదు. నిజంగా సీఆర్‌డీఏ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. అలా కాకుండా అప్పట్లో ఐదేళ్ల మాదిరిగానే ఇప్పుడూ గ్రాఫిక్స్ చూపిస్తూ భ్రమరావతిగా మార్చితే మాత్రం ప్రయోజనం శూన్యం. మంత్రి నారాయణ ఆధ్వర్యంలో అప్పట్లో సేకరించిన భూములతో వ్యాపారం చేసుకున్నారు తప్పించి రాజధాని నిర్మాణం మరిచారన్న ఆరోపణలు ఉన్నాయి. మొక్కుబడిగా నాలుగు భవనాలకు పునాదులు వేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. గ్రాఫిక్స్ రాజధానిని సిద్ధం చేసి పచ్చ పత్రికల్లో రోజుకో ఫొటో ప్రచురించి అసెంబ్లీ ఇలా, సచివాలయం అలా, కోర్టు భవనాలు ఇలా, రాజగోపురాలు అలా, సిటీ ఇలా అంటూ కేవలం ఆర్భాటాలకే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం పరిమితమైంది. సింగపూర్ గ్రాఫిక్స్‌తో కొన్నాళ్లు నడిపించారు. ఇలా ఐదేళ్ల కాలం వెళ్లదీశారు. రాజధాని కన్నా అక్కడి భూములపైనే చంద్రబాబు సర్కార్‌కు మక్కువని, అందుకే రాజధాని నిర్మాణాన్ని పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక తిరిగి రాజధాని నిర్మాణ బాధ్యతలు మంత్రి నారాయణకే అప్పగించారు. సీఆర్డీఏను విస్తృతం చేయడాన్ని ఎవరూ వ్యతిరేకించరు. కానీ అభివృద్ధి చేయకుండా కేవలం పరిధి పెంచడంవల్ల ఒరిగే ప్రయోజనం మాత్రం ఉండదనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. గతంలో వేమూరు నియోజకవర్గం సీఆర్‌డీఏలోనే ఉంది. ఐదేళ్లపాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పాలన సాగించినా ఒరిగింది ఏమీ లేదు. ప్రత్యేకంగా మౌలిక వసతుల కల్పన జరగలేదు.

అరెస్టులకు బెదిరేది లేదు



నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో ఉన్న వెంకటరామిరెడ్డి గురించి న్యాయవాదులతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు, బాలవజ్రబాబు



అరండల్‌పేట పోలీస్ స్టేషన్ వద్ద ఇంటూరి రవికిరణ్‌ను పరామర్శిస్తున్న అంబటి రాంబాబు, పోలూరి వెంకటరెడ్డి తదితరులు

- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాది పోరాట పంథా
- రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు ఎదురొడ్డి పోరాడతాం
- డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ ఆదేశాల మేరకే అరెస్టులు
- డీజీపీ రాజకీయ వ్యాఖ్యలు చేయడం విడ్డూరం
- మాజీ మంత్రి విడదల రజినిపై అసభ్యకర పోస్ట్ పెడితే చర్యలు లేవు
- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లకు అండగా లీగల్ సెల్
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : అరెస్టులకు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా బెదిరేది లేదని, తొలి నుంచి తమ పార్టీది పోరాట పంథా అని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు ఎదురొడ్డి పోరాడతామని తెగేసి చెప్పారు. పోలీసులు అరెస్టు చేసిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డిని గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో బుధవారం పార్టీ లీగల్ సెల్ సభ్యులతోపాటు అంబటి, నగర అధ్యక్షుడు డైమండ్ బాబు, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పరామర్శించారు. స్టేషన్ సీఐ వీరానాయక్‌తో మాట్లాడారు. అనంతరం అంబటి మీడియాతో మాట్లాడారు. పోలీసులు అధికారపార్టీ నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాల మేరకు అరెస్టులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. గతంలో ఎప్పుడో పెట్టిన పోస్టులకు ఇప్పుడు అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. డీజీపీ రాజకీయ నాయకుడిలా మాట్లాడుతున్నారని, 30 ఏళ్ల క్రితం కేసులూ తోడతామని ఆయన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పాత కేసులు తోడినా తమకేం అభ్యంతరం లేదని, కానీ ప్రభుత్వాలు స్థిరంగా ఉండవని గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన విచారణను ఆయన తప్పుబట్టడం సరికాదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు ఎన్ని కేసులు పెట్టినా బెదరరని, మరింత రాటుదేలతారని పేర్కొన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అండగా ఉందని స్పష్టం చేశారు. సంస్కారవంతంగా పోస్టులు పెట్టడంలో తమ పార్టీ కార్యకర్తలు ముందుంటారన్నారు. సూపర్ సిక్స్ హామీలపై కూటమి ప్రభుత్వాన్ని అంబటి నిలదీశారు. మాజీ మంత్రి విడదల రజినిపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు లేవని, ఆ పోస్టులు డీజీపీకి కనపడలేదా అని ప్రశ్నించారు. విడదల రజిని ఫిర్యాదుపై ఎందుకు చర్యలు తీసుకోలేదని అడిగారు. డీజీపీ గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని, ఆయన రాజకీయ నేత కాదని, పోలీసులు పెట్టిన కేసుల విషయం తాము న్యాయస్థానాల్లో తేల్చుకుంటామని అంబటి స్పష్టం చేశారు. అనంతరం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఉన్న పార్టీ సోషల్ మీడియా కార్యకర్త వైజాగ్‌కు చెందిన ఇంటూరి రవికిరణ్‌ను పరామర్శించారు. ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావుతో మాట్లాడారు. రవికిరణ్‌కు పార్టీ లీగల్ సెల్ బృందం అండగా ఉంటుందని చెప్పారు.


రైతులతో 'బంతి' ఆట

- నష్టాల బాటలో పూల కర్షకులు
- ధర పతనంతో కుదేలు
- తెగుళ్లతోనూ సతమతం
- మార్కెట్లో కిలో కేవలం రూ.20

చేబ్రోలు: ప్రతికూల వాతావరణ పరిస్థితులు, నష్టాల వల్ల సంప్రదాయ పంటలను వదిలి ప్రత్యామ్నాయంగా బంతిపూల సాగు చేపట్టిన రైతులతో విధి బంతాట ఆడుతోంది. తెగుళ్లతో పాటు ధర పతనం కర్షకులను కుదేలు చేస్తోంది. ఫలితంగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చు ఎక్కువే..

చేబ్రోలు మండలం శలపాడు, సుద్దపల్లి, గొడవర్రు, వేజండ్ల, నారాకోడూరు, గుండవరం తదితర గ్రామాల్లో ఈ ఏడాది సుమారు 30 ఎకరాల్లో బంతిపూల సాగు చేపట్టారు. గత ఏడాది ఏర్పడిన వాతవరణ పరిస్థితుల వల్ల మెట్ట పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ప్రయోగాత్మకంగా బంతిపూల సాగువైపు మళ్లారు. ఫలితంగా ఈ ప్రాంతంలో బంతిపూల సాగు విస్తీర్ణం పది ఎకరాల నుంచి 30 ఎకరాలకు పెరిగింది. వాస్తవానికి బంతి సాగుకు ఖర్చు ఎక్కువే. ఎకరానికి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒక్కో మొక్కను రూ.మూడుకు కొని ఎకరానికి 15వేల మొక్కలను నాటాలి. దీనికి సుమారు రూ.40వేల వరకు ఖర్చు అవుతుంది. కౌలు రూ. 25 నుంచి 30వేలకు పోతుంది. నీటి తడులు, దుక్కులు, బలం మందుల పిచికారీ పెట్టుబడులు అదనం. పరిస్థితులు అన్నీ అనుకూలిస్తే 80 నుంచి 90 క్వింటాళ్ల వరకు పూల దిగుబడి వస్తుంది. గిట్టుబాటు ధర లభిస్తే రైతుకు పండగే. ఖర్చులన్నీ పోను ఎకరానికి రూ.50వేల వరకు లాభం ఉంటుంది. అయితే ఈ ఏడాది అధిక వర్షాల వల్ల బంతికి తెగుళ్ల బెడద ఎక్కువైంది. మచ్చ తెగులుతో తోటలు దెబ్బతింటున్నాయి. మందులు వాడినా ఫలితం ఉండట్లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం బంతిపూల ధర కుదేలైంది. మార్కెట్లో కిలో కేవలం రూ.20 పలుకుతున్నాయి. డిమాండ్ ఉన్నప్పుడు కిలోకు రూ.60 నుంచి రూ.80 వరకు ధర వస్తుంది. కార్తిక మాసం సమీపించిన నేపథ్యంలో ధర పెరుగుతుందేమోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధరతో పూల కోత ఖర్చులూ రావట్లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



నష్టాలు మిగులుతున్నాయి



ప్రస్తుతం మార్కెట్లో బంతి పూల ధర పూర్తిగా పతనం అయింది. కిలోకు కేవలం రూ. 20 మాత్రమే లభిస్తోంది. లక్ష రూపాయిల వరకు పెట్టుబడి అయింది. గిట్టుబాటు కావట్లేదు. నష్టాలు మిగులుతున్నాయి. కోత, రవాణా, గోతాం తదితర ఖర్చులూ వచ్చే పరిస్థితి కనపడడం లేదు. కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరం.

– పరిశా చిరంజీవి, శలపాడు, బంతి పూల రైతు



చేబ్రోలు మండలం సుద్దపల్లిలో సాగవుతున్న బంతి పూల తోట (ఇన్‌సెట్) తెగులు సోకి దెబ్బతిన్న మొక్కలు

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,000** గరిష్ఠం : రూ. **3,800**

మోడల్ ధర రూ. **3,400**

క్లుప్తంగా

తల్లి చెంతకు పిల్లలు



మంగళగిరి: కాజ టోల్‌గేట్ వద్ద లభ్యమైన ఇద్దరు పిల్లలను పోలీసులు తల్లి జయమ్మకు అప్పగించారు. మంగళవారం కాజ టోల్‌గేట్ వద్ద గుర్తు తెలియని పిల్లలు లభించగా వారిని తీసుకుని ఎస్‌ఐ స్టేషన్‌కు చేరుకున్నారు. వారి తల్లి ఆచూకీ కోసం పిల్లలను తీసుకుని విజయవాడ, గుంటూరుకు వెళ్లి వారు చెప్పిన అడ్రస్‌లలో తిరిగారు. ఎట్టకేలకు వారు పాతగుంటూరుకు చెందిన వారిగా గుర్తించి అదే రోజు పిల్లల తల్లి జయమ్మ, అమ్మమ్మలకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నయాగరా అధినేత 'పోలిశెట్టి' కన్నుమూత



రేపల్లె రూరల్: నయాగరా ఫైల్స్ ఇండస్ట్రీస్ అధినేత పోలిశెట్టి నాగమల్లేశ్వరరావు (92) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని పట్టణంలోని స్వగృహానికి బుధవారం తీసుకొచ్చారు. నాగమల్లేశ్వరరావు 1964 నయాగరా ఫైల్స్ ఇండస్ట్రీస్‌ను చిన్న పరిశ్రమగా నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పించారు. లయన్స్ క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలకు ప్రభుత్వం ఇందిరా ప్రియదర్శిని పురస్కారాన్ని అందజేసింది. నాగమల్లేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయనకు పలువురు రాజకీయ ప్రముఖులు నివాళి అర్పించారు.

క్యాన్సర్‌ను జయించొచ్చు

- అందుబాటులో ఆధునిక వైద్యం
- ముందే గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చు
- వైద్య నిపుణుల వెల్లడి
- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం

గుంటూరు మెడికల్: క్యాన్సర్(రాచపుండు)కు ఇప్పుడు అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉంది. ముందే గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. తగు జాగ్రత్తలతో ముందుకు సాగితే క్యాన్సర్‌ను జయించడం కష్టమేమీ కాదని స్పష్టం చేస్తున్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2014 నుంచి ఏటా నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినం నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ చికిత్సలో కీలకమైన రేడియంను కనిపెట్టిన పోలాండ్ దేశానికి చెందిన మేడం క్యూరీ పుట్టిన రోజునే అవగాహన దినంగా నిర్వహించడం గమనార్హం.

గుర్తించడం ఎలా?

మానకుండా ఉన్న పుండ్లు, శరీరంలోని ఏ భాగంలోనైనా ఎదుగుతున్న గడ్డలు, కణుతులు, అసహజమైన రక్తస్రావం, పెరుగుతున్న పుట్టుమచ్చలు, పులిపిరి కాయలు, మింగటం కష్టంగా ఉండటం, గొంతు బొంగురుపోయి తగ్గకుండా ఉండటం, చాలా రోజులుగా ఉన్న అజీర్ణవ్యాధి తదితర లక్షణాలు ఉంటే తక్షణమే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.



క్యాన్సర్ డే పోస్టర్

కారకాలు

సిగిరెట్ పొగలో 400 రకాల హానికారక రసాయనాలు ఉంటాయి. వీటితోపాటు గుట్కా, పాన్, మసాలాలు, వేపుళ్లు, నిల్వ ఉన్న పచ్చళ్లు, బేకరీ పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల నోటి, పేగు, కిడ్నీ క్యాన్సర్‌లు వస్తాయి. ఊబకాయుల్లో మూత్రాశయ, గర్భాశయ, పేగు క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది, పాంక్రియాటిక్ క్యాన్సర్లూ వస్తాయి. పారిశ్రామిక వ్యర్థాలు, ఫ్యాక్టరీలు వదిలే పొగల వల్ల క్యాన్సర్ వచ్చే రిస్క్ 3 నుంచి 4 శాతం ఉంటుంది.

మాంసాహారాల్లో క్యాన్సర్ కణాలు

తాజా కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి. వీటిల్లో క్యాన్సర్ కారకాలతో పోరాడే యాంటిజెంట్స్ ఉంటాయి. మాంసాహారాల్లో క్యాన్సర్ కణాలు అధికంగా ఉంటాయి. ఇవి తినే వారు తప్పనిసరిగా వెజిటబుల్ లేదా ఫ్రూట్ సలాడ్ తినాలి. దీనివల్ల మాంసాహారంలో ఉండే క్యాన్సర్ కణాలతో సలాడ్‌లోని యాంటీజెంట్స్ పోరాడతాయి. కొవ్వుశాతం తక్కువగా ఉన్న ఆహారం తీసుకుంటే క్యాన్సర్లు వచ్చే అవకాశాలు తక్కువ. భోజనంతో తాజా పండును రోజూ తీసుకోవాలి. రోజూ కనీసం అరగంటసేపు వ్యాయామం చేయాలి. స్మోకింగ్, మద్యం, పాన్, గుట్కా లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి.

మహిళల్లో రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్

నాన్‌కమ్యూనకబుల్ డిసీజ్ ప్రోగ్రాంలో గత ఏడాది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించగా జిల్లాలో 2,54,636 మంది రొమ్ము, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్‌లతో బాధపడుతున్నట్లు గుర్తించారు. జిల్లాల్లో 40 మంది క్యాన్సర్ వైద్య నిపుణులు ఉండగా రోజూ వీరి వద్ద 30 నుంచి 50 మంది వరకు రోగులు వైద్యసేవలు పొందుతున్నారు.

స్క్రీనింగ్ పరీక్షల ద్వారా చెక్



క్యాన్సర్‌కు ఇప్పుడు ఎన్నో వైద్య పద్ధతులు ఉన్నాయి. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా రోగానికి చెక్‌పెట్టవచ్చు. ముందస్తుగా వ్యాక్సిన్‌లు వేయించుకోవటం ద్వారా గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్‌ల నుంచి రక్షణ పొందొచ్చు. హెపటైటిస్-బీకి కూడా వ్యాక్సిన్ వేయించుకోవటం ద్వారా వ్యాధి రాకుండా నిరోధించవచ్చు. ముందస్తుగా పరీక్షలు చేయించుకోవటం చాలా మంచిది. లిక్విడ్ బయాప్సీ, పెట్‌స్కాన్, ఇమ్యునోహిస్టోకెమిస్ట్రి వంటి అత్యాధునిక వైద్య పద్ధతుల ద్వారా అతి తక్కువ సమయంలో, ప్రాథమిక స్థాయిలోనే పలు రకాల క్యాన్సర్‌లను గుర్తించి నివారించవచ్చు.

– డాక్టర్ బైరవనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు.

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సుమారు రూ.45 కోట్లతో ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్ నిర్మించాం. ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలతో క్యాన్సర్ రోగులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. రూ.కోట్లు ఖరీదు చేసే అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ స్టిమ్యులేటర్ వైద్య పరికరాలను ప్రభుత్వం అందజేసింది. పెట్‌స్కాన్ పరికరాన్ని తాజాగా మంజూరు చేసింది. మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్, న్యూక్లియర్ మెడిసిన్, రేడియోథెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నాం. చివరి దశలో ఉన్నవారికీ ప్యాలేటీవ్ కేర్ చికిత్సలు అందించేందుకు ఈనెలాఖరులోపు వంద పడకలతో వార్డు నిర్మించనున్నాం. మందులు కూడా ఉచితంగా అందిస్తున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్

సరస్వతీ భూములపై కూటమి నేతల రాద్ధాంతం

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సరస్వతీ భూములపై జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అవాస్తవాలను మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ అధ్యాపక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని పేర్కొన్నారు. సరస్వతీ భూములు కొనుగోలు చేసి 20 సంవత్సరాలకుపైగా గడిచిందని, ఉద్యోగాలు, ఉపాధి వస్తాయనుకున్న రైతులు, నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్న మాటల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు. ఆ భూములు రైతుల నుంచి వారి ఇష్ట ప్రకారం వారు ఆశించిన ధర కంటే అధికంగా చెల్లించి కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రభుత్వ భూములను 40 ఏళ్ల నాడు సాంఘి, అంబుజా సిమెంట్స్, మై హోమ్స్ వంటి వారికి దోచిపెట్టిన గత ప్రభుత్వాల గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. వైఎస్ జగన్ కొనుగోలు చేసిన భూములపై ఉద్దేశపూర్వకంగానే నానా యాగీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌పై ఎన్ని నిందలు మోపినా.. ప్రజలు నమ్మరన్నారు. అక్కడ ఫ్యాక్టరీ కట్టకుండా అడ్డుకుంది చంద్రబాబు, కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్ వైఎస్ జగన్‌పై ఉక్రోషంతో వ్యక్తిగత విమర్శలు చేస్తూ.. పర్యటనలు చేయటాన్ని ప్రజలు గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పటం తథ్యమని స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీకి దళితులే పట్టుగొమ్మలు

పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

పట్నంబజారు(గుంటూరు వెస్ట్): వైఎస్సార్ సీపీకి దళితులే పట్టుగొమ్మలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా నిలబడింది దళిత వర్గాలేనని పేర్కొన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు, నా ఎస్టీలంటూ వారిని తన సొంత మనుషుల్లా భావిస్తారని పేర్కొన్నారు. దళితవర్గాలపై జరుగుతున్న దాడులపై పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సోషల్ మీడియా వేదికగా ఏదో పోస్టు పెట్టారని, కేవలం 41 నోటీసులు ఇవ్వాల్సిన కేసుల్లోనూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అయినా ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కచ్చితంగా ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా.. అండగా పార్టీ శ్రేణులు నిలబడతారని హామీనిచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి దళితులపై జరుగుతున్న దాడులకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఎంతటి కష్టాన్నైనా భరించి, ఎత్తిన జెండాను దించకుండా ముందుకు సాగిన ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. పార్టీ పదవుల నియామకాల్లోనూ ఏ ఒక్కరికి అన్యాయం జరగదని స్పష్టం చేశారు. పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్ మాట్లాడుతూ జగనన్న ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని తూచా తప్పకుండా ఎస్సీ విభాగం తమ భుజాన వేసుకుని ముందుకు సాగుతోందన్నారు. కేసులకో, బెదిరింపులకో పార్టీ కార్యకర్తలు భయపడే పరిస్థితి లేదన్నారు. ఖచ్చితంగా వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎస్సీ విభాగం నేతలతో మాట్లాడి వారి అభిప్రాయాలను అంబటి పంచుకున్నారు. ఆయా ప్రాంతాల్లో వారిని కూటమి నేతలు పెడుతున్న ఇబ్బందులు, బెదిరింపులను పార్టీ జిల్లా నేతల దృష్టికి తీసుకు వచ్చారు. ఎటువంటి ఇబ్బంది వచ్చినా నేరుగా తామే వస్తామని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నేతలు బత్తుల దేవానంద్, అత్తోట జోసఫ్, ప్రభు, పిల్లి మేరీ, బుల్లా మేరీ, సందీప్, ఏటుకూరి విజయసారధి, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, పచ్చల ఆనంద్, జొన్నలగడ్డ రత్నకుమారి, సత్తెనపల్లి రమణి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15లోపు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం పూర్తి చేస్తాం

కలెక్టర్ నాగలక్ష్మి



హాస్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: రూ.మూడు కోట్ల వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ ఎస్సీ హాస్టల్ నిర్మాణాన్ని డిసెంబర్ 15లోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం బీఆర్ స్టేడియం ఎదుట నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆమె పరిశీలించారు. 90 సెంట్ల విస్తీర్ణంలో ఐదేళ్ల క్రితం రూ.మూడు కోట్ల అంచనాతో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు సంబంధించిన పనుల్లో బిల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి రూ.2.10 కోట్లు ఖర్చు చేసినట్లు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.అనిల్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. భవన నిర్మాణ పనులు పూర్తికి మరో రూ.90 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ గ్రాంటుతో భవన నిర్మాణ పనులు పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వచ్చేనెల 15లోగా పనులు పూర్తిగా చేపట్టి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఏసీ కళాశాల ఎదుట ఉన్న పురాతన ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. ప్రాంతీయ గ్రంథాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించి భవనం శిథిలావస్థలోఉందని గమనించారు. గ్రంథాలయం పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఏపీఇడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. గ్రంథాలయంలో లైట్లు, ఫ్యాన్ల కొరత ఉందని పాఠకులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆయా వసతులను సమకూర్చుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట డివిజనల్ ఇంజినీర్ బీఏ రవీంద్ర, గుంటూరు తూర్పు తహసీల్దార్ నగేష్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారిణి చెంచు లక్ష్మి, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

సెంచరీలతో హోరెత్తించిన ఆంధ్ర బ్యాట్స్‌మెన్లు

తొలిరోజు 90 ఓవర్లలో 374 పరుగుల భారీ స్కోర్



122 పరుగులు చేసిన యూరన్



113 పరుగులు సాధించిన లోహిత్



3 వికెట్లు తీసిన బౌలర్ నౌనిలాల్

మంగళగిరి: నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం కూచ్ బెహరా ట్రోఫీ అండర్ -19 క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. తొలిరోజు జరిగిన ఆంధ్ర వర్సెస్ హిమాచల్ ప్రదేశ్ మ్యాచ్‌లో ఆంధ్ర బ్యాట్స్‌మెన్‌లు సెంచరీలతో హోరెత్తించారు, తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో ఆంధ్ర 4 వికెట్లు కోల్పోయి 374 పరుగుల భారీ స్కోరు సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు బ్యాట్స్‌మెన్‌లు ఎం.యూరన్, లోహిత్ లక్ష్మీనారాయణలు సెంచరీలతో చెలరేగిపోయారు. యూరన్ 117 బంతులలో 9 సిక్స్‌లు, 5 ఫోర్లతో 122 రన్స్ సాధించగా లోహిత్ లక్ష్మీనారాయణ 166 బంతులలో 12 ఫోర్లు, 6 సిక్స్‌లతో 113 రన్స్‌తో రాణించారు, హిమాచల్ ప్రదేశ్ బౌలర్ నౌనిలాల్ 3 వికెట్లు తీశాడు.

గంజాయి ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అజీజ్, ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్, వెనుక ముసుగులో ఉన్న నిందితులు

21 కిలోలు స్వాధీనం

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): అక్రమంగా గంజాయి తరలించటంతోపాటు, విక్రయాలు చేస్తున్న ఆరుగురు యువకుల ముఠాను గుంటూరు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. లాలాపేట పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఏవీ శివప్రసాద్ వివరాలను మీడియాకు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. గుంటూరు సంపత్‌నగర్ అప్పడాల కంపెనీ సమీపంలో నివాసం ఉండే కొత్తవారి సాయిచరణ్ అలియాస్ గణేష్, అదే ప్రాంతానికి చెందిన మద్దాల చక్రపాణి, షేక్ సలీం అలియాస్ హైదరాబాద్, గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామానికి చెందిన దండమూడి జగదీష్ అలియాస్ డీజే, చిన్నబజారు ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్‌రజాక్, కింగ్స్ హోటల్ పక్కన ఉండే షేక్ ఆరీఫ్ వ్యసనాలకు బానిసలుగా మారి వైజాగ్, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి గంజాయిని రూ. 2వేల చొప్పున కొని తీసుకువస్తారు. ఇక్కడ కిలో రూ 20 వేలకుపైగా అమ్మటంతోపాటు, పొట్లాలుగా చేసి విక్రయాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఏటుకూరు రోడ్డులోని డంపింగ్ యార్డు వద్దకు గంజాయి తీసుకుని వచ్చి, పంచుకుంటున్న క్రమంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితుల్లో కొత్తవారి సాయి చరణ్ అలియాస్ గణేష్, దశరథరామిరెడ్డి అలియాస్ అభి అనే వ్యక్తితో కలిసి కొంత కాలంగా సెల్‌ఫోన్‌లు, బైక్‌లు చోరీలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు వివరించారు. వారిపై పలు స్టేషన్‌లో చోరీ కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవటంలో ప్రతిభకనబరిచిన ఎస్సైలు ఆర్ఎం విజయ్‌కుమార్, షేక్ హసీమ్, కానిస్టేబుళ్ళు పి. కిరణ్, పి. శంకర్, యు. గోవిందరాజులు, ఆర్. ఆంజనేయులు, ఎ.మల్లికార్జునరావు, అప్పలనాయుడును అభినందించారు.

పత్తి రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు రాజబాబు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో పత్తి పండించిన రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవడానికి తమ సమీప ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు సూచించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రైతులు పత్తిని ఆరబెట్టుకుని తేమ శాతం 8 నుంచి 12 శాతం లోపు ఉండేలా చూడాలన్నారు. బయట మార్కెట్‌లో పత్తి ధర తక్కువగా ఉందని, దళారుల మాటలకు నష్టపోకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తరలించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 పొందాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో ఫిరంగిపురం, తాడికొండ, మేడికొండూరు, తుళ్ళూరు, ప్రత్తిపాడు మండలాలకు చెందిన 145 మంది పత్తి రైతులు సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరించారు. అయితే తేమ శాతం విషయంలో సీసీఐ 15 నుంచి 20 శాతం సడలింపు ఇవ్వాలని రైతులు కోరుతున్నట్లు ఆయన వెల్లడించారు.

ఉద్యోగ విరమణ నోటీసులు జారీ చేసి న్యాయం చేయాలి

డీఈఓకు ఏపీటీఎఫ్ జిల్లా నేతల వినతి




డీఈవో రేణుకకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది ఉద్యోగ విరమణ చేయనున్న ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారులు నోటీసులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకకు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు విన్నవించారు. బుధవారం డీఈవో రేణుకను కలిసి సంఘ నేతలు వివిధ అంశాలపై వినతిపత్రం సమర్పించారు. బసవలింగారావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణకు ఆరునెలల ముందుగా పెన్షన్ ప్రతిపాదనలను సిద్ధం చేసి, సంబంధిత అధికారులకు పంపాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఆ ప్రక్రియను ప్రారంభించలేదని, ఎంఈవోల నుంచి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వకపోవడంతో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. పెన్షన్ ప్రపోజల్స్ ఆలస్యమైతే ఉద్యోగ విరమణ పొందిన నెలలో పెన్షన్ అందక ఆర్థిక ఇబ్బందులు పడతారని వివరించారు. తక్షణమే నోటీసులు జారీ చేయాలని కోరారు. మున్సిపల్, నగరపాలక సంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను మెరిట్ కం రోస్టర్ విధానంలో తక్షణమే విడుదల చేయాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు ఎస్ఎస్ఎన్ మూర్తి, జి.దాస్, సీనియర్ నాయకులు చక్కా వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్ పి.శివరామకృష్ణ, జోసెఫ్ కిరణ్ కుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి

ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు ఆవేదన



మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖ విధానాలతో ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడి అనుభవిస్తున్నారని ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు అన్నారు. బుధవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో సుధీర్‌బాబు మాట్లాడుతూ విద్యా సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం వల్ల హైస్కూళ్లలో ప్రధానోపాధ్యాయులకు టెన్త్ నామినల్ రోల్స్ నిర్వహణ భారంగా మారిందని, మరోవైపు అపార్ నమోదు ప్రక్రియ తలనొప్పిగా ఉందని వివరించారు. సరైన రవాణా సౌకర్యాలు లేని కేంద్రాలలో శిక్షణ ఇవ్వడం వలన అక్కడికి చేరుకునేందుకు టీచర్లు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ 50 ఏళ్లకు పైబడిన ఉపాధ్యాయులకు, వికలాంగులకు, చిన్నపిల్లలు ఉన్న మహిళా టీచర్లకు శిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. నూజివీడు సమీపంలోని ఆగిరిపల్లిలో ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమంలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఉపాధ్యాయుడు మరణించడం బాధాకరమని అన్నారు. వేసవి సెలవుల్లోనే వృత్తి శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిమళ్ల ప్రసాదరావు, రాష్ట్ర కౌన్సిలర్ కమతం శ్రీనివాసరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వై.శ్యాంబాబు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సు ఢీకొని నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు



బస్సు ఢీకొట్టడంతో కింద పడిన మహిళలు

తాడేపల్లిరూరల్: విజయవాడ నుంచి గుంటూరు వెళ్తున్న గుంటూరు-2 డిపో నాన్‌స్టాప్ బస్సు ఢీకొని విజయవాడ కృష్ణలంకకు చెందిన నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం రాత్రి తాడేపల్లి మండలం కొలనుకొండ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అదే సమయంలో క్యాంపు కార్యాలయం నుంచి వెళ్తున్న చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ప్రమాదాన్ని గమనించి కాన్వాయ్‌ను ఆపి గాయపడిన నలుగురు మహిళలను తన వ్యక్తిగత సిబ్బంది కారులో వైద్యం నిమిత్తం ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. నలుగురికీ వైద్యం చేయించారు. విజయవాడ కృష్ణలంకకు చెందిన ఆదిలక్ష్మి, నారాయణమ్మ, సరస్వతి, నారాయణమ్మలు కొలనుకొండలోని బహుళ అంతస్తుల్లో వంట, ఇంటి పనులు చేస్తున్నారు. వీరు తిరిగి విజయవాడ వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా బస్సు ఢీకొంది. వీరిలో నారాయణమ్మ పేర్లు కలిగిన ఇద్దరి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని ఎన్ఆర్ఐ వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు.

వైద్య సిబ్బంది సమస్యలపై వినతి



గుంటూరు మెడికల్: వైద్య రంగంలో వినియోగంలో ఉన్న పలు యాప్‌లతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తొలగించాలని ఏపీ హంస అసోసియేషన్ నేతలు బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి సమస్యలు లేకుండా చూస్తానని కృష్ణబాబు హామీ ఇచ్చారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ హాజరు వల్ల జీతాల్లో కోత విధించారని, వాటిని తిరిగి చెల్లించాలని, కొత్తగా రెగ్యులర్ అయిన హెల్త్ అసిస్టెంట్, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగుల ప్రొబేషన్‌ను ఒక్క సంవత్సరం తగ్గించాలని సంఘ నేతలు కోరగా కృష్ణబాబు సానుకూలంగా స్పందించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) రాష్ట్ర అధ్యక్షుడు ఆరవ పాల్, రాష్ట్ర సెక్రటరీ శ్రీనివాస్ , రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బి. కిరణ్, జిల్లా అధ్యక్షుడు బి. నాగవర్ధన్‌రెడ్డి , మహ్మద్ షరీఫ్ తదితరులు ఉన్నారు.